క్లుప్తంగా

కూచిపూడి నృత్యంలో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ



గుడివాడటౌన్: కూచిపూడి నృత్యంలో తమ విద్యార్థులు సత్తాచాటి అవార్డులు పొందడం తమ పాఠశాల కళలపై చూయిస్తున్న శ్రద్ధకు నిదర్శనమని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అన్నారు. హైస్కూల్ ప్రాంగణంలో అవార్డులు పొందిన విద్యార్థులను ఆయన బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగం తిరిచ్చి శ్రీకృష్ణ మహల్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో చెన్నైకు చెందిన రంగ రామానుజ వికాయేస్ ప్రొడక్టివిటీ అండ్ కల్చరల్ కౌన్సిల్ నిర్వహించిన మార్గాజి కదంబోత్సవం 2022–23 కార్యక్రమంలో తమ విద్యార్థులు డి.రితిక, డి.ప్రదీక్ష కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి విజేతలుగా నిలిచారని తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

పామర్రు: మండల పరిధిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని పామర్రు ఎస్‌ఐ అవినాష్ బుధవారం తెలిపారు. కనుమూరు గ్రామ పరిధిలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారంతో అందడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.45,500 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మండలంలో ఎవరైనా పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మొవ్వ: మండలంలోని పెదపూడి గ్రామానికి చెందిన అనగాని వీర రాఘవయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సచివాలయ అధికారులు బుధవారం అందజేశారు. ఈ నెల 15వ తేదీన వీరా రాఘవయ్య పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా పాముకాటుకు గురై మృతి చెందాడు. వీరా రాఘవయ్య భార్య వీరరాఘవమ్మకు పీఏసీఎస్ అధ్యక్షుడు తాతా రాంబాబు ద్వారా నగదు అందజేశారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సోమయాజుల శ్రీరామాంజనేయులు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

గుడివాడటౌన్: కొనకళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ యువకుడు రక్తదానం చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన అంజలి కాన్పు నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరగా శస్త్రచికిత్సకు రక్తం అత్యవసరమైంది. ట్రస్ట్‌కు చెందిన కొనకళ్ల తేజ ముందుకొచ్చి రక్తదానం చేశాడని సీతయ్య పేర్కొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

గూడూరు: గూడూరు మండలంలోని గూడూరు–1, మల్లవోలు–1, కంకటావ గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ శిబిరాలు నిర్వహిస్తామని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఈనెల 24 వరకు నిర్వహించే శిబిరాలలో సమీప గ్రామాల వారీగా ఆధార్ సేవలు అందిస్తామని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. 19న మల్లవోలు, రామానుజవత్తర్లపల్లి, గూడూరు, 20న ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, పోలవరం, ముక్కొల్లు, తరకటూరు, 21న రాయవరం, లేళ్లగరువు, కోకనారాయణపాలెం, 23న కంచాకోడూరు, ఆకుమర్రు, మద్దిపట్ల, కలపటం, పోసినవారిపాలెం, 24న రామరాజుపాలెం, కంకటావ, ఆకులమన్నాడు గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బార్‌లో కొట్లాటపై కేసు

కోనేరుసెంటర్: బార్‌లో మద్యం మత్తులో జరిగిన కొట్లాటపై ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం పాతరామన్నపేటకు చెందిన మాగంటి సాయికుమార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన అతని స్నేహితుడి పుట్టినరోజు కావడంతో నగరంలో బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించేందుకు స్నేహితులంతా కలిసి వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో అక్కడ ఉన్న ఓగీసుపేటకు చెందిన కొంత మంది సాయికుమార్‌తో గొడవకు దిగారు. సర్దుబాటు చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన సాయికుమార్‌పై అకారణంగా దాడి చేసి గాయపరిచారు. సాయికుమార్‌తో పాటు అతని స్నేహితుడిపైనా దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆర్‌పేట పోలీసులు తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- నందిగామలంక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని నందిగామలంక గ్రామంలో సర్పంచ్ నేతల నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మోరు వెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్ బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, పార్టీ అని భేదాలు లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మూడేళ్లలో అందజేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత చేరువగా పరిపాలన సాగుతుందన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, గుడివాడ తమ్మిస్వామి, ముంగర మల్లికార్జునరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ, నాయకులు మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, ఎస్‌ఐ టి.రామకృష్ణ, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ లలిత, వెలుగు సీసీ అమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కొనకళ్ల తదితరులు

గుడివాడటౌన్: కళాకారుడిగా ప్రజల మన్ననలను పొంది పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలలో అధికారాన్ని చేజిక్కించుకుని ప్రజా నాయకుడిగా ఎదిగిన గొప్ప నేత నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సభ జరిగింది. తొలుత నాయకులు స్టేడియం కమిటీ సభ్యులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, సభ్యులు పిన్నమనేని సాంబ శివరావు, బొగ్గారపు తిరుపతయ్య, కిలారు రంగ ప్రసాద్, చింతా రఘుబాబు, వల్లభనేని ప్రసాదు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి చుండూరి శేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి వెంపటి సైమన్, మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాశరావు, కొలుసు నరేంద్ర, బోయిన శేఖర్, మహిళా కార్యకర్తలు హారిక, మూడెడ్ల ఉమ, రమీజా, సునీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మహిళలకు చీర, జాకెట్, పురుషులకు ప్యాంట్, షర్టులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, బొప్పన కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

పామర్రు: వల్లూరి పల్లి చక్రవర్తి స్థలంలో బుధవారం అన్న క్యాంటీన్‌ను పారంభించారు. తొలుత నాలుగురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, పార్టీ నాయకులు వర్ల కుమార్‌రాజా, వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని స్థానిక నాలుగురోడ్ల కూడలి, కొమరవోలు, నిమ్మ కూరు, ఎలకుర్రు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. పామర్రు నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్టీర్ విగ్రహం టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, టీడీపీ మండల అధ్యక్షుడు కె.ప్రవీణ్‌చంద్ర, మాజీ ఎంపీపీ జి.లక్ష్మీదాసు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే డీఎన్నార్



కొల్లేటికోట పెద్దింట్లమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి ఆలయ అభివృద్ధిని వివరించారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న అనివేటి మండపం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఉడిముడి సుబ్బరాజు, బేతాల వీరకుమారి, పద్దాల సుబ్బలక్ష్మి, స్థానిక నేతలు శాకమూరి రాజు, అమ్మణ్ణ రాజా, తలారీ నగేష్, రంగిశెట్టి కొండా, కన్నా సాంబయ్య, ఆనంద సత్యనారాయణ, శ్రీనివాసరావు, రూరల్ ఎస్‌ఐ చల్లా కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు



ప్రసంగిస్తున్న పేర్ని కిట్టు

పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాద భద్రాద్రి రామాలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన పాలకవర్గాన్ని పేర్ని కిట్టు అభినందించి మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందేలా చూడాలన్నారు. భక్తుల రాకను పెంపొందించే కార్యక్రమాలు రూపొందించి నిర్వహించాలని చెప్పారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అనుమకొండ శ్రీధర్, సభ్యులుగా వేప రామస్వామి (బాబులు), అశ్వధాటి పూర్ణచంద్రరావు, తాడివాక పద్మ, అలగలశెట్టి విజయ, కేశన బేబి సరోజిని, సోడాబత్తుల లలిత, దిట్టకవి బాలశేష కృష్ణమాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు. వీరితో ఆలయ ఈఓ గోవాడ వెంకటకృష్ణారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మామిడిబత్తుల రోజా, డివిజన్ ఇన్‌చార్జి మామిడిబత్తుల అజయ్, తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, గాజుల భగవాన్, మరీదు నాగరాజు, షేక్ మొహమ్మద్ సాహెబ్, చీలి చక్రపాణి, బూరగ రామారావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు, వీఏఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు



శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు

మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. వైదిక కార్యక్రమాలతో పాటు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతి కార్యక్రమాలను కూడా సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయంలో నిత్య ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

- 25వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లికుమారుడిని చేసి, ఎండోమెంట్ తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన తదితర పూజా కార్యక్రమాలు, 26వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్య హోమం, బలిహరణ మధ్యాహ్నం శేషవాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదురుకోలు ఉత్సవం, 8 గంటలకు దివ్యకల్యాణ మహోత్సవం, నందివాహనంపై గ్రామోత్సవం ఉంటుందన్నారు.
- 27వ తేదీ ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, రాత్రి 8 గంటలకు కనులపండువగా స్వామివారి రథోత్సవం ఉంటుంది.
- 28వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతస్నపన, ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, అవభృతస్నానోత్సవం, శ్రీ సుబ్రహ్మణ్య మాల దీక్ష విరమణ, పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు శమీవృక్షపూజ, మయూర వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి.
- 29వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 8 గంటలకు స్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ నిర్వహిస్తారు.
- 26న సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, 27న సాయంత్రం 6 గంటలకు భరతనాట్యం, 28న సాయంత్రం 9 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం, 29న రాత్రి 9 గంటలకు తిరుపతమ్మ కథ నాటకం ప్రదర్శిస్తారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కృత్తివెన్ను: తీర ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్షించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణంపై పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. గతంలో వేసిన రోడ్లకు సోషల్ ఆడిట్ పూర్తయితే ఇప్పుడు సీసీ వేసుకునేందుకు అనుమతి తీసుకోవచ్చని అధికారులు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, ఉప సర్పంచ్‌లు సత్యనారాయణ, శిరీష, ఎంపీడీఓ పిచ్చిబాబు, డీటీ శశికుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి ఉన్నాం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని కచ్చితంగా ప్రభుత్వం అమలు చేస్తుందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. ఆయన చాంబర్‌లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ ఈ నెల 20వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారన్నారు. జిల్లాలోని వివిధ పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ అంశంపై నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. డీపీఓ నాగేశ్వరనాయక్, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి వెంకట్రావు, మునిసిపల్ కమిషనర్లు జి. చంద్రయ్య, పి. వెంకటేశ్వరరావు, అంజయ్య పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అంతరాలయ ముఖ ద్వారానికి బుధవారం మండలంలోని శ్రీహరిపురానికి చెందిన బొగ్గవరపు సుబ్రహ్మణ్యం, నాగసీతామహాలక్ష్మి దంపతుల కుమార్తె దేవీ నాగవెంకట సాయికీర్తి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ కొంతి నాగరాజుకు అందజేయగా సహాయ కమిషనర్ నేల సంధ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పరుచూరి చెన్నకేశవరావుకు నివాళి

మొవ్వ: కమ్యూనిస్టు నాయకుడు పరుచూరి చెన్నకేశవరావు ఆదర్శనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పెదపూడి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకులు, ప్రజా నాట్యమండలి కళాకారుడు చెన్నకేశవరావు 20వ వర్ధంతిని కూచిపూడి–పెదపూడి సెంటర్లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు చిత్రపటానికి పూలమాలలేసి నివాళ్లు అర్పించారు. సీపీఐ నాయకులు దగాని సంగీతరావు, ఆర్.పిచ్చయ్య, టి.తాతాయ్య, చెన్నకేశవరావు భార్య రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల ఆదాం

గుడివాడటౌన్(నందివాడ): మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, అధికారులు అందరం సమష్టిగా కృషిచేద్దామని నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి, ఆదాయ వ్యయాలపై సభ్యులతో కలిసి సమీక్ష జరిపారు. నూతనంగా చేపట్టాల్సిన పనుల జాబితాను ప్రజా ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఎంపీపీ ఆదాం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆక్వా సాగు పూర్తి విస్తీర్ణం మొత్తం మత్స్యశాఖ ద్వారా ఆక్వా జోన్‌లోకి చేర్చారు. ఈ అంశాన్ని సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీ పూడి సుధాకరరావు, ఎంపీడీఓ బి.వై.విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు ఎన్టీఆర్

అఖిల భారత తెలుగు అకాడమీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ

నిమ్మకూరు(పామర్రు): పేద వర్గాల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి సంస్కరణలు తెచ్చిన గొప్ప మానవతావాది నందమూరి తారక రామారావు అని అఖిల భారత తెలుగు అకాడమీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ అన్నారు. మండల పరిధి ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరు గ్రామంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా ది పామర్రు కళా పరిషత్ సహకారంతో ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేవుడు ఎలా ఉంటాడో వేషధారణతో నటించి చూపించిన అన్న ఎన్టీఆర్.. రాజకీయాల ద్వారా ప్రజా సేవ అంటే ఏమిటో చేతల్లో చూపించారన్నారు. అనంతరం ఎన్టీఆర్ పై 128 కవితలతో ప్రముఖ కవి వసుధ బసవేశ్వరరావు రాసిన విశ్వ విఖ్యాత పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ రచయితతో పాటు సేంద్రియ ఎరువుల తయారు చేసే రైతుల విజ్ఞాన సంఘం ద్వారా గుర్తింపు పొందిన పెదమద్దాలి ఆదర్శ రైతు డొక్కు సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అకాడమీ సహాయ కార్యదర్శి శేషగిరిరావు, నిమ్మకూరు కళాశాల ప్రిన్సిపల్ చదలవాడ ప్రదీప్ కుమార్, కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, అధ్యక్షుడు ఎస్. త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులు దాసరి వెంకటరత్నం, నందమూరి వంశస్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

రూ.5 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన గృహోపకరణాలు



దగ్ధమైన బీరువా, దుస్తులు

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు నిట్టాడుల పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన కోడూరు మండలం స్వతంత్రపురంలో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఈశ్వరమ్మ దంపతులు రెండు నిట్టాడుల పూరిల్లు వేసుకొని నివాసముంటున్నారు. శ్రీనివాసరావు దంపతులు మంగళవారం పనిపై బయట గ్రామానికి వెళ్లారు. బుధవారం వేకువజామున మూడు గంటల సమయంలో శ్రీనివాసరావు ఇంటి నుంచి మంటలు రావడాన్ని పక్కనే ఉన్న గృహస్తులు గమనించారు. మంటలు పక్కకు వ్యాపించకుండా అదుపు చేయడంతో పాటు అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గృహోపకరణాలు, విలువైన సామగ్రి, నగదు, బంగారంతో పాటు విలువైన పత్రాలు కాలిపోయాయని బాధితులు విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు.

రెడ్‌క్రాస్ చేయూత..

అగ్ని బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, గృహోపకరణలు, దుస్తులను అందించారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా ఘటనాస్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా బియ్యం, రూ.5 వేల నగదు అందించారు. సొసైటీ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆత్మస్థైర్యం పెంపు

ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరిస్వామి



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి

అవనిగడ్డ: ఆధ్యాత్మికత, ధ్యాన చింతన కలిగి ఉంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొన వచ్చని ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి అన్నారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఆధ్యాత్మికత – ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదానంద గిరి స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధ్యానం నేర్చుకోవాలని, దీని ద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుందని వివరించారు. ధ్యానంలో ముఖ్య అంశాలను విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టార్స్ వెలగపూడి లక్ష్మణరావు, పార్థసారథి, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- చల్లపల్లి: విద్యార్థి దశలో ధ్యానం చేయడం ద్వారా మేధోశక్తి పెరుగుతుందని ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి అన్నారు. బుధవారం స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ధ్యానంతో అనంతమైన మేధోశక్తి అంశంపై సదస్సు జరిగింది. ధ్యానంతో లభించే శక్తి విద్యపై శ్రద్ధ, ఏకాగ్రత పెంచుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్, అధ్యాపకులు పర్యవేక్షించారు.

ఆర్బీకే, రైస్‌మిల్లులను రోజూ సందర్శించండి

జేసీ అపరాజితసింగ్



మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతిరోజు రైతు భరోసా కేంద్రం, రైస్‌మిల్లులను సందర్శించాలని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లంకభూముల గుర్తింపు, రీ–సర్వే, ఈకేవైసీ నమోదు అంశాలపై తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు పలు మండలాల్లో ధాన్యం తడిచి రంగుమారిందని, రంగుమారిన ధాన్యం, నూకలైన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్లు ప్రతి రోజూ రెండు రైస్‌మిల్లులు, మూడు రైతుభరోసా కేంద్రాలను సందర్శించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. నదీ తీర ప్రాంతంలోని లంక భూములను గుర్తించి నివేదికలు ఇవ్వాలని చెప్పారు. రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. తహసీల్దార్లు వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ. కిషోర్, బి. పద్మావతి, కె. విజయకుమార్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్, డీఎస్ఓ వి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.